మా ఊరు మారింది

- బడి బాగుపడింది.. పాలన చేరువైంది
- ఇంటికే పథకాలు
- అంతకాపల్లి వాసుల హర్షాతిరేకాలు



జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు

అంతకాపల్లి అభివృద్ధికి చిరునామాగా మారింది. మండలంలోని మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సమగ్రాభివృద్ధికి బాటలు పడ్డాయి. ప్రతి వీధిలో అభివృద్ధి కనిపిస్తోంది. సచివాయలం, రైతు భరోసా కేంద్రం , వెల్‌నెస్ సెంటర్‌తో పాటు ఆధునికీకరించిన పాఠశాలలను చూసిన ప్రజలు మా ఊరు మారిందంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సబ్బవరం: సంక్షేమంతో పాటు అభివృద్ధిలో అంతకాపల్లి పంచాయతీ అగ్రపథంలో నిలిచింది. పాలన చేరువవడంతో మినీ మండల సముదాయం గ్రామం వచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అందుబాటులోకి వచ్చిన రైతు భరోసా కేంద్రం



అంతకాపల్లి నుంచి అయ్యన్నపాలెం వరకూ విస్తరించిన బీటీ రోడ్డు

ఇదీ పరిస్థితి

అంతకాపల్లి గ్రామ పంచాయతీ జనాబా 4,444 మంది ఉన్నారు. గ్రామానికి రావలమ్మపాలెం,ఒమ్మువానిపాలెం శివారు గ్రామాలుగా ఉన్నాయి. వ్యవసాయం,పశుపోషణతో పాటు కొంతమంది ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. గతంలో గ్రామ ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యేవారు. రోడ్లు,తాగునీరు వంటి సమస్యలను ప్రధానంగా ఎదుర్కొనేవారు. ప్రభుత్వ సేవలు,పథకాల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు..



గ్రామంలో నిర్మించిన సచివాలయం

నేడు మారిన స్వరూపం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామం రూపురేఖలు మారిపోయాయి. అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. మౌలిక సదుపాయాల కల్పనతో గ్రామంలో కొత్తకళ సంతరించుకుంది. సీఎం వైఎస్ జగన్‌తో గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అన్నదాతలు గతంలో ఎరువులు, పురుగు మందుల కోసం మండల కేంద్రాలు, ప్రైవేటు డీలర్లను ఆశ్రయించే వారు. నేడు గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో విత్తనాలు,ఎరువులు గ్రామంలోనే అందుతున్నాయి.



గ్రామం నుంచి గొంపవారి పాకలు వరకూ వేసిన సీసీ రోడ్డు



వెల్‌నెస్ సెంటర్

అంతకాపల్లి గ్రామ సచివాలయం పరిధిలో

జనాభా	: 4,444
ఓటర్లు	: 3,529
అభివృద్ధికి కేటాయించిన నిధులు	: రూ. 9.13 కోట్లు
సంక్షేమ పథకాల కింద అందించిన సొమ్ము	: రూ. 29.37 కోట్లు
శివారు గ్రామాలు	: రావలమ్మపాలెం, ఒమ్మువానిపాలెం

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు

సచివాలయ అదనపు ఫ్లోర్ నిర్మాణం	: రూ.25 లక్షలు
రైతు భరోసా కేంద్రం	: రూ.23.94 లక్షలు
వెల్ నెస్ సెంటర్	: రూ.20.80 లక్షలు
నాడు–నేడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధునికీకరణ	: రూ.46.20 లక్షలు
మండల పరిషత్ పాఠశాల ఆధునికీకరణ	: రూ.20.13 లక్షలు
సీసీ డ్రైన్లు, రోడ్ల అభివృద్ధికి	: రూ.87.70 లక్షలు
కల్యాణ మండపం నిర్మాణం	: రూ.60 లక్షలు
బీటీ రోడ్ల అభివృద్ధి	: రూ.3 కోట్లు
జలజీవన్ మిషన్‌లో కుళాయిల ఏర్పాటుకు	: రూ.96 లక్షలు
ఓటర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం	: రూ.29 లక్షలు
గ్రావెల్ రోడ్ల అభివృద్ధి	: రూ.19.60 లక్షలు



నాడు-నేడులో ఆధునికీకరించిన మండల పరిషత్ పాఠశాల

సొంతింటి కల నెరవేరింది



మా సొంతింటి కల నెరవేరింది. గుల్లేపల్లి–సబ్బవరం ప్రధాన రహదారిని ఆనుకుని జాతీయ రహదారికి సమీపంలో సుమారు రూ.5 నుంచి రూ. 6 లక్షలు విలువ చేసే స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో సొంతింటిని నిర్మించుకున్నాం. ఇంటి స్థలాన్ని ఉచితంగా సచివాలయంలోనే మా పేరిట రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందించింది. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– చిటిమిరెడ్డి రూప, రావలమ్మపాలెం,సబ్బవరం

తాగునీటి సమస్యకు చెక్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య తీరింది.గతంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారం. ఫ్లోరైడ్ సమస్య ఉండడంతో గ్రామంలో నీటిని తాగేందుకు ఇబ్బంది పడేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోటికి పైగా వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టి ఇంటింటి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసింది. మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నీటిని కుళాయిల ద్వారా అందించడంతో ఫ్లోరైడ్ సమస్యకు చెక్ పెట్టారు.

– అల్లు దేవి, రావలమ్మపాలెం,సబ్బవరం

గ్రామ రూపు రేఖలు మారాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల రూపురేఖలు మారాయి. కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాం.మా ప్రభుత్వ సేవలు, సమాచారం తెలుసుకోవాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ ప్రభుత్వం గ్రామంలోనే మండల సముదాయాన్ని తలపించేలా అన్ని ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి తెచ్చింది.

– సబ్బవరపు నారాయణమూర్తి, సర్పంచ్, అంతకాపల్లి, సబ్బవరం

క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

కోదండ రామాలయాన్ని సందర్శించిన టీటీడీ బృందం



నిర్మాణంలో ఉన్న కోదండ రామ ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్‌కేసీఎం శర్మ తదితరులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో పునర్నిర్మిస్తున్న కోదండ రామ ఆలయానికి విగ్రహాలను తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చనుంది. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌స్పెక్షన్ కమిటీ, హిందూ ధర్మప్రచార పరిషత్ విశాఖ క్లస్టర్ సూపరింటెండెంట్ ఎస్‌కేసీఎం శర్మ, పండితులు చల్లా సత్యనారాయణతో కూడిన కమిటీ నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని శుక్రవారం పరిశీలించారు. వారితో పాటు గ్రామ పెద్దలు బోకం రాము నాయుడు,బండారు శ్రీను,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రోమాల అప్పలనాయుడు,గజ్జి దేముడు బాబు,పల్ల శ్రీరాములు నాయుడు, బోకం స్వామి అప్పల ఈశ్వరరావు,అనిమిరెడ్డి మహేశ్వరరావు, కొల్లూరు రమేష్,నక్కెళ్ల మంగరాజు తదితరులు ఉన్నారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని వినతి

పరవాడ: విధులు సక్రమంగా నిర్వహించని ముత్యాలమ్మపాలెం ఇన్‌చార్జి వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు గణపతిరావును శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. నాయుడుపాలెం వీఆర్వోగా పనిచేస్తున్న కమలను ముత్యాలమ్మపాలెం ఇన్‌చార్జిగా నియమించారని.. ఆమె నాయుడుపాలెంలోనే ఉంటూ ముత్యాలమ్మపాలెం ప్రజలను తన వద్దకు పిలిపించుకోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగనన్న హౌసింగ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. దీనిపై వీఆర్వో కమల వివరణ ఇస్తూ రెండు చోట్ల ఒకే పర్యాయం విధులు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. రోజు తప్పించి రోజు ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు.

భైరవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భైరవస్వామి

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని శుక్రవారం భైరవవాకలోని భైరవ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4గంటల నుంచి ఆలయానికి చేరుకున్నారు. సాయత్రం వరకు భక్తుల రద్దీ నెలకుంది. స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మేర ఉన్న మార్గమంతా భక్తజన సంద్రంగా మారింది.

456 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: పెందుర్తి మండలం రాంపురం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 456 మంది రోగులు పేర్లు నమోదు చేసుకున్నారు. గైనకాలజిస్టు,జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్,డెంటల్ వైద్యులు సేవలందించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య సేవల అనంతరం రోగులకు ఉచితంగా మందులు ఇచ్చామన్నారు. వైద్య శిబిరాన్ని నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రామారావును సత్కరిస్తున్న అధికారులు

పరవాడ: పప్పు దినుసులు, చిరుధాన్యాల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) పారామౌంట్ సంస్థ చైర్మన్ బి.చైతన్య రాజీవ్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో జేసీఐ సంస్థ చైర్మన్ రాజీవ్ మాట్లాడుతూ పప్పు దినుసులు, చిరు ధాన్యాలు సాగు చేయడంలో రైతులకు తగిన ప్రోత్సాహం లభిస్తేనే వ్యవసాయ రంగంపై యువత మొగ్గు చూపుతారన్నారు. వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి ఆధ్వర్యంలో ఆదర్శ అపరాల సాగు చేస్తున్న రైతులు గెద్దం రామారావు, కోన సన్యాసిరావు, చీపురుపల్లి సుందర్రావు, దుంగల ఎరుకునాయుడులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఈవో పి.సంజీవరావు, ఎం.వి.ఎస్.మూర్తి, బి.గౌతమి, డి.వి.ఆంజనేయులు, పి.సాయిదీప్, పి.శరణ్‌దీప్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అనివార్యం



విద్యార్థులతో సస్టెయినబిలిటీ సీహెచ్‌ఆర్వో డాక్టర్ సుజీవ్ నాయర్ తదితరులు

పరవాడ: ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అనివార్యంగా మారిందని రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ సీహెచ్‌ఆర్వో డాక్టర్ సుజీవ్ నాయర్ అన్నారు. సస్టెయిన్‌బిలిటీ పరిశ్రమ సీఎస్సార్ నిధులతో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేయడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని తద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందన్నారు. పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామని రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవీ రామిరెడ్డి ప్రకటించారు. వేదికపై నుంచి ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎంపీ హెడ్ కె.రవికుమార్, ఫౌండేషన్ ప్రతినిధి కె.శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం కనకేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.పద్మావతి, ఉపాధ్యాయులు విక్టోరియా, ఫ్రాన్సిస్, అన్నాజీరావు పాల్గొన్నారు.

1093వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1093వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూపోతే భారత దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన యూనిట్ టీం

అక్కిరెడ్డిపాలెం: సమగ్ర శిక్షలోని పార్ట్ టైం టీచర్లను ఒకేషనల్ టీచర్లుగా మార్పు చేస్తున్నట్టు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారని జిల్లా యూనిట్ టీం అధ్యక్షుడు రవిచంద్ చెప్పారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 23 శాతం జీతం పెరుగుదల జీవో విడుదల చేసిన సందర్భంగా ఆయనతో పాటు యూనిట్ టీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకర్, జిల్లా యూనిట్ టీం కార్యదర్శి కె.శ్రీనివాసరావు మంత్రిని కలిసి ధన్యవాదాలు చెప్పారు. ఉపాధ్యాయుల మిగిలిన అంశాలు కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి చెప్పినట్లు రవిచంద్ ఓ ప్రకటనలో తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా



మండల కాంప్లెక్సు వద్ద బోల్తా పడిన లారీని పైకి లేపుతున్న క్రేన్లు

పరవాడ: లంకెలపాలెం-పరవాడ రహదారిలో పరవాడ మండల కాంప్లెక్సు సమీపంలోని మలుపులో ఓ లారీ బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గంగవరం పోర్టు నుంచి గృహాలకు ఉపయోగించే సున్నం రాళ్ల లోడుతో అచ్యుతాపురం వైపు వెళుతున్న లారీ శుక్రవారం తెల్లవారు జాము 4 గంటల సమయంలో మండల కాంప్లెక్సు మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాక చక్యంగా తప్పించుకొన్నాడు. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. బోల్తా పడిన లారీని రెండు క్రేన్ల సాయంతో అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం భవానీనగర్-లక్ష్మీపురం రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం పూర్తయ్యాయి. ఆయా పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ రూ.కోటి జీవీఎంసీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



హెచ్‌పీసీఎల్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం పిలుపునిచ్చారు. సమ్మెకు సహకరించాలని కోరుతూ హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ విజయ్‌కుమార్‌కు శుక్రవారం భోగవల్లి సమ్మెకు సంబంధించిన నోటీస్ అందించారు. హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో భోగవల్లి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తునట్టు వివరించారు. దీనికి కార్మికులంతా సహకరించాలని ఆయన కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు దేశంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ అఖిల పక్ష కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.

‘యాత్ర-2’తో అభిమానులకు పండగ



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అదీప్‌రాజ్



పార్టీ నాయకులతో కలిసి సినిమా వీక్షిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: యాత్ర సినిమాకు సీక్వెల్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితంలో జరిగిన యథార్థ గాదలను తెరకెక్కించిన యాత్ర-2 సినిమాకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. సినిమాను సబ్బవరంలోని ఎస్‌టీబీఎల్ థియేటర్‌లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పార్టీ నాయకులు,అభిమానులతో కలిసి శుక్రవారం రాత్రి వీక్షించారు. అంతకముందు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. చిత్రం చూసిన అదీప్‌రాజ్ మాట్లాడుతూ జగనన్న జీవితంలో జరిగిన యదార్థ ఘటనలు కళ్లకు కట్టినట్లు చిత్రంలో సన్నివేశాలను దర్శకుడు తెరకెక్కించారన్నారు. ప్రజల మనిషిగా.. తండ్రిని మించిన తనయుడిగా చిరస్థాయిగా జగనన్న అభిమానులు, ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సినిమా వీక్షించిన వారిలో ఆయనతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సీనియర్ నాయకుడు బోకం రామునాయుడు, బంతికోళ్ల పద్మ,దెడ్డం పద్మావతి, యడ్ల నాయుడు, ఐడీ బాబు తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



గుల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే నులిపురుగులకు చెక్ పెట్టాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని శుక్రవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించారు. గుల్లేపల్లి మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి ఆల్బెంజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రాము నాయుడు,బండారు శ్రీను, గుల్లేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్ఎస్ఆర్‌డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

12,246 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మండలంలో 12,819 మందికి గానూ 12,246 మందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేసి 95.5 శాతం పూర్తి చేశామని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి తెలిపారు. సబ్బవరం పీహెచ్‌సీలో 2,240 మంది చిన్నారులకు గాను 1,966 మందికి, గుల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో 920 మందికి గానూ 876 మందికి ఈ ట్యాబ్‌లెట్లు వేశామన్నారు.